క్లుప్తంగా

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: గతేడాది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమైన అక్కిరెడ్డిపాలేనికి చెందిన సాయి హర్ష కుటుంబానికి సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ బాసటగా నిలిచింది. ఇప్పటికే ఆర్థిక సహాయం అందించిన ట్రస్ట్ ఈసారి నెలకు సరిపడా బియ్యం, పప్పుల, నూనెలు, సబ్బులు, ఇతర సామగ్రి అందించారు. ఉక్కు అధికారి రాజేశ్వరరావు, వినియోగదారుల హక్కుల పరిరక్షణవేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు ఆర్థిక సహాయంతో వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగి విందుల పాపారావు, ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్ర రావు, చిత్తా నాగమణి, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, పాముల వసంతకుమార్, ట్రస్ట్ చైర్మన్ మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన శానిటరీ కార్యదర్శులకు సత్కారం



సచివాలయ కార్యదర్శులను సత్కరిస్తున్న పారిశుధ్య సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డులోని పలు సచివాలయాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన శానిటరీ కార్యదర్శులను బుధవారం పారిశుధ్య సిబ్బంది సత్కరించారు. వార్డు శానిటరీ కార్యదర్శులు కె.రాంబాబు, ఎం.శ్రీను, జె.నరేష్, ఎన్.భవానీలను అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సత్కరించి వారి సేవలను కొనియాడారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర, గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్ ఎం.కోటేశ్వరరావు, 85వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామయ్య, సీడబ్ల్యూసీ కార్యదర్శి కె.పైడిరాజు, నాయకులు బి.సత్యనారాయణ, బి.అప్పారావు, డి.రమేష్, జి.పద్మ, భాను, నాగమణి, మంగవేణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



ఉత్సాహంగా తలపడుతున్న క్రీడాకారులు

గాజువాక: ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్–19 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. క్రమశిక్షణ, అంకిత భావం, పట్టుదలతో క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ద్వారకానాథ్, డాక్టర్ అంకమ్మ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, గంధం శ్రీనివాసరావు, రాజాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యం



రైల్వే ట్రాక్‌పై మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కణితి రైల్వే బ్రిడ్జి ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభించింది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. ఆ మార్గంలో వెళుతున్న రైలు లోకో పైలెట్ ట్రాక్‌పై మృతదేహం ఉందని గుర్తించి స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి 45 ఏళ్లు ఉంటాయని గుర్తించారు. అయితే తలభాగం మొత్తం నుజ్జుయిపోవడంతో గుర్తుపట్టడానికి అవకాశం లేకుండా పోయింది. ఆ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా... లేదా మరేదైనా కారణముందా అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కేశవరావు తెలిపారు.

నగ ధగధగ



ఆకట్టుకునే మోడళ్లు.. బంగారు, వజ్రాభరణాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఆభరణాలు.. ఇప్పుడు మగువల మదిని దోచేస్తున్నాయి. బంగారు, వజ్రాల మార్కెట్‌కు పోటీగా వస్తున్నాయి. ఎక్కడ చూసినా కృత్రిమ ఆభరణాల ట్రెండే నడుస్తోంది. అత్యధికమంది మహిళలు అనుకరణ ఆభరణాల (ఇమిటేషన్ జ్యూయలరీ) వైపు ఆకర్షితులవుతున్నారు. మహిళల అభిరుచులకనుగుణంగా బంగారం, వజ్రాలు, వెండి ఆభరణాలకు ప్రతిరూపంగా సరసమైన, స్టైలిష్‌గా ఇమిటేషన్ జ్యూయలరీ లభిస్తోంది. క్రమంగా ఈ మార్కెట్ పెరుగుతోంది.

– గాజువాక

ఇమిటేషన్ జ్యూయలరీ వైపు మొగ్గు

విస్తరిస్తున్న దుకాణాలు | మగువల మదిని దోచేలా విభిన్న డిజైన్లలో ఆభరణాలు



దేని విలువ దానిదే

నిరంతరం అభివృద్ధి చెందుతున్న ఫ్యాషన్ ప్రపంచంలో అనుకరణ ఆభరణాలకు ఉండే ఆదరణ తాత్కాలికమైనదే. నిజమైన ఆభరణాలు సెంటిమెంట్, పెట్టుబడి విలువను కలిగి ఉంటాయి. కృత్రిమ ఆభరణాలు సరసమైన ధర, ట్రెండ్ ఆధారిత డిజైన్లను మాత్రమే అందించగలుగుతాయి. అవి ఎటువంటి పెట్టుబడి విలువను కలిగి ఉండవు. ఈ నేపథ్యంలో నిజమైన ఆభరణాలు కొనుగోలుదారుల విలువను పెంచుతుంటే కృత్రిమ ఆభరణాలు ఫ్యాషన్ ప్రపంచంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తున్నాయి.



గాజువాకలోని ఇమిటేషన్ జ్యూయలరీ షాప్

విస్తరిస్తున్న మార్కెట్

ఇమిటేషన్ జ్యూయలరీ, గ్రాము బంగారు ఆభరణాల మార్కెట్ గాజువాకలో క్రమంగా విస్తరిస్తోంది. నిన్న మొన్నటివరకు ఫ్యాన్సీ షాప్‌లు, పెద్ద పెద్ద షాపింగ్ మాళ్లలో లభించే అనుకరణ ఆభరణాల అమ్మకాలకు ఇప్పుడు ప్రత్యేక షాప్‌లు ఏర్పాటయ్యాయి. గాజువాక పట్టణంలో ఈ ఆభరణాలను విక్రయించే షాపులు పదికి పైగా ఉన్నాయి. గాజువాక మెయిన్ రోడ్, కణితి రోడ్‌లను అనుసంధానం చేసే పాత పోలీస్ స్టేషన్ వీధిలోనే ఐదు షాపులున్నాయి. వ్యాపారులు కోయంబత్తూరు, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి ఇమిటేషన్ జ్యూయలరీని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు.

కీలక తేడాలు ఇవే

- బంగారు ఆభరణాలు, వజ్రాల ఆభరణాలు శాశ్వత ఆకర్షణను అందిస్తున్నప్పటికీ కొంచెం బరువు కలిగి ఉండటంతో ఎక్కువ సేపు ధరించలేని పరిస్థితి ఉంటుంది. కృత్రిమ ఆభరణాలు తేలికైనవి. దీంతో రోజంతా ధరించడానికి సౌకర్యవంతంగా ఉంటాయి.
- నిజమైన ఆభరణాలను క్లాసిక్, సాంప్రదాయ డిజైన్లలో క్యూరేట్ చేస్తారు. వారసత్వ నైపుణ్యంపై దృష్టి సారించి శాశ్వత ఆకర్షణను అందిస్తాయి. కృత్రిమ ఆభరణాలు అనుకరణను కలిగి ఉంటాయి. అంతులేని శ్రేణిలో లభిస్తాయి. కొత్త ట్రెండ్‌లను అన్వేషించే వారికి అనుకరణ ఆభరణాలు విభిన్న ఎంపికను అందిస్తాయి.
- నిజమైన ఆభరణాలు శాశ్వతమైన ఆస్తి. దీర్ఘకాలిక విలువను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేస్తారు. ప్రతి వస్తువును కొనుగోలు చేయడం వెనుక ఒక ప్రయోజనం ఉంటుంది. కృత్రిమ ఆభరణాలు రిఫ్రెష్‌మెంట్ కోరుకొనేవారికి ఉద్దేశించినవి. ట్రెండ్‌తో ప్రయోగాలు చేయాలను కొనేవారికి, తమ ఆభరణాలను నవీకరించాలను కొనేవారికి, ఫ్యాషన్ ప్రియులకు కస్ట్యూమ్ ఆభరణాలు ఒక ఆదర్శవంతమైన ఎంపిక మాత్రమే.

కృత్రిమ ఆభరణాలకు ఆదరణ

తక్కువ ధరకు అద్భుతమైన డిజన్లను అందించగల సామర్థ్యం ఇమిటేషన్ జ్యూయలరీకి ఉంది. చక్కదనం, విలాసాన్ని వెదజల్లుతున్న సరసమైన ఆభరణాలను కోరుకొనేవారికి, ఫ్యాషన్ ఔత్సాహికులకు ఎక్కువ ఖర్చు లేకుండా అందుబాటు ధరలో లభిస్తాయి. ప్రయాణంలో వీటిని తీసుకెళ్లడం చాలా సులభం. నిజమైన ఆభరణాలను తీసుకెళ్లడం భద్రతా ప్రమాణాలతో కూడుకొని ఉంటుంది. అనుకరణ ఆభరణాల విషయంలో నష్టం, దొంగతనం గురించి చింతించకుండా స్వేచ్ఛగా తీసుకెళ్లవచ్చు. నిజమైన ఆభరణాలతో పోల్చితే కృత్రిమ ఆభరణాల నిర్వహణ చాలా సులువు. బంగారు, వజ్రాల ఆభరణాల మెరుపును



కొనసాగించడానికి క్రమం తప్పకుండా పాలిష్ చేయించుకోవాలి. కృత్రిమ ఆభరణాలు తక్కువ నిర్వహణను కలిగి ఉంటాయి. నిజమైన ఆభరణాలు ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఎక్కువగా ధరిస్తారు. అనుకరణ జ్యూయలరీ సాధారణ ప్రయాణాలు, సామాజిక కార్యక్రమాలకు సులభంగా ధరించుకొని వెళ్లవచ్చు.

ఆదరణ బాగుంది



ప్రస్తుతం ఇమిటేషన్ జ్యూయలరీకి ఆదరణ బాగుంది. మహిళలు తమకు నచ్చిన ఆభరణాలు ఎంచుకొనే విధంగా అన్ని మోడళ్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఒకవేళ మావద్ద ఉన్న మోడళ్లు నచ్చకపోతే తమకు ఏ మోడల్ కావాలో ఆర్డర్ ఇచ్చి వెళ్తుంటారు. తర్వాత వాటిని తీసుకొచ్చి అందజేస్తాం. క్రమంగా ఈ వ్యాపారానికి కూడా పోటీ పెరుగుతోంది.

– వెంకటేష్, వ్యాపారి

నచ్చిన డిజైన్లలో ఆభరణాలు



నచ్చిన డిజైన్లలో ఇమిటేషన్ జ్యూయలరీ దొరుకుతుంది. గాజువాకలో ఇప్పుడు ప్రత్యేక షోరూమ్‌లు వచ్చాయి. షాప్‌లలోను అందుబాటులో ఉన్నాయి. తక్కువ ధరకు లభిస్తున్నాయి. భారీ బడ్జెట్‌లో ఆభరణాలు కొనుక్కోలేని పరిస్థితుల్లో ఇమిటేషన్ జ్యూయలరీ వైపు చూస్తున్నాం. తులం రూ.లక్ష పెట్టి బంగారు ఆభరణాలను కొనుక్కోవడం కంటే రూ.10వేలు పెట్టి నచ్చిన అన్ని వస్తువులను ఇమిటేషన్ జ్యూయలరీలో తెచ్చుకోవచ్చు.

– జి.ప్రసన్న, గాజువాక

కరాటే విజేతలకు ట్రోఫీ అందజేత



ట్రోఫీ అందజేస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: ఇటీవల నగరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో గాజువాకకు చెందిన యూనివర్సల్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ ప్రదర్శించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో రెండో స్థానాన్ని సొంతం చేసుకొన్నారు. ఈ సందర్భంగా గాజువాకలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు చేతులమీదుగా విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే సాధన చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా సూకరాజు, అకాడమీ చైర్మన్ శరత్, స్థానిక నాయకులు గూటూరు శంకరరావు, సత్యనారాయణ, జయప్రకాష్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న విజ్ఞాన్ సంస్థల చైర్మన్ రత్తయ్య

అగనంపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను బుధవారం విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అభినందించారు. ఏయూలో నిర్వహించిన పోటీల్లో కె. మోనాలీషా (800 మీటర్ల పరుగు పందెం), సాయితేజ (డిస్కస్‌త్రో), పి.రవితేజ డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీల్లో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈ నెల 9 నుంచి 11 వరకు చీరాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఫిజికల్ డైరెక్టర్లు రాంబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గులు వేసి.. అవగాహన కల్పించి..



ముగ్గులేస్తున్న పారిశుధ్య సిబ్బంది

కూర్మన్నపాలెం: ఎక్కడిపడితే అక్కడ చెత్త వేయకుండా జీవీఎంసీ సిబ్బంది బుధవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా చెత్త వేసిన ప్రాంతాన్ని శుభ్రం చేసి అనంతరం ఆవుపేడతో కళ్లాపు జల్లారు. అంతటితో ఆగిపోకుండా ఆ ప్రాంతంలో ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. ఆ తర్వాత అక్కడ హెచ్చరిక బోర్డు వేళాడదీశారు. వివరాల్లోకి వెళ్తే.. 87వ వార్డు కాళింగవీధి – ఆటోనగర్ మధ్యలో రహదారిపై చెత్త వేయడం ఆనవాయితీగా మారింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పలు మార్లు అధికారులు అవగాహన కల్పించినా పరిస్థితి మారలేదు. ఇక లాభం లేదనుకున్న పారిశుధ్య సిబ్బంది ముందుగా చెత్తను తొలగించారు. ఆ తర్వాత కళ్లాపు జల్లి ముగ్గులు వేసి అక్కడ చెత్తవేసే వారికళ్లు తెరిపించారు. అనంతరం అక్కడ చెత్త వేస్తే వెయ్యి రూపాయలు జరిమానా వేస్తామని హెచ్చరిక బోర్డుపెట్టారు.

తల్లిపాలు.. అమృత తుల్యం

- బిడ్డకు పాలిస్తే అమ్మకు ఆరోగ్యం
- నేటితో ముగియనున్న తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెదగంట్యాడ: అమ్మ అనే పదంలోనే ఆప్యాయత.. అనురాగం..మురిపెం.. మిళితమై ఉంటుంది. తల్లిపాలతోనే బిడ్డకు తొలి టీకా అవుతుంది. శారీరక ఎదుగుదలకు దోహదపడుతోంది. నవజాత శిశువుకు బలం చేకూరుస్తుంది. అయితే కొందరు పిల్లలకు ముర్రుపాలు పట్టేందుకు అయిష్టత చూపుతున్నారు. దీంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని వ్యాధులు సోకే ప్రమాదంలోకి నెడుతున్నారు. ఈ క్రమంలోనే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మపాలు విశిష్టత పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

తల్లిపాలతో బలం

నవజాత శిశువులకు బలం చేకూర్చే ఆహారం తల్లి పాలే అని వైద్య నిపుణులు చెబుతున్నారు. నూరు శాతం పోషక విలువలున్న తల్లిపాలు శిశువు ఆరోగ్యంగా ఎదగడంలో, ఆయుష్షు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడిస్తున్నారు. అందుకే తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని సీడీపీవో నీలవేణి తెలిపారు.

ఆర్నెల్ల పాటు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టిన గంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆర్నెల్ల పాటు తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇస్తే బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, ఆలర్జీ, ఆస్తమా,చర్మ వ్యాధులు నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక, శారీరక వికాసానికి ఆవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలని, ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచిస్తున్నారు. రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలంటున్నారు.

బాధ్యతగా భావించాలి



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందుగానే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గురువారంతో వారోత్సవాలు ముగుస్తాయి.

– నీలవేణి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పెందుర్తి

ఘనంగా గురువులకు వందనం వేడుకలు



విజయ జ్యోతిని సత్కరిస్తున్న అతిథులు

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువులకు వందనం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ ఉష పేరిట సీనియర్ కూచిపూడి నాట్యకళాకారిణి బి.విజయ జ్యోతికి ఉష జీవిత సాఫల్య పురస్కారం అతిథుల చేతుల మీదుగా అందించి ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్రకు చెందిన 22 మంది గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా క్రిష్ణ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ మిత్ర, కూచిపూడి కళాక్షేత్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, అధ్యక్షులు హరి రామమూర్తి, సింధుజ, గోపీనాథ్, మహాలక్ష్మి, రాగా, కళ్యాణి పాల్గొన్నారు.

యారాడ పాఠశాలకు మైక్ సెట్ వితరణ



పాఠశాలకు అందించిన మైక్ సెట్, బ్లూటూత్

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డులో యారాడ ఉన్నత పాఠశాలకు పాఠశాలలో విధుల నిర్వహిస్తున్న జీవ శాస్త్ర ఉపాధ్యాయురాలు జీఎం సునీత రూ. 25 వేల విలువ గల మైక్ సెట్, బ్లూటూత్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు తన వంతుగా సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం కూడా ఉండాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తూ విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. తోటి ఉపాధ్యాయులు సునీత టీచర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బంక రాము, నాగోతి మధు, మంగ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాజువాక: కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కర్ణవానిపాలెం గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ గురువారం ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శ్రీనగర్, కర్ణవానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు పోషకాలు

పెదగంట్యాడ: బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రపాలు తాగించాలని సిద్ధేశ్వరం–2 అంగన్‌వాడీ టీచర్ రేవతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్ధేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల అవశ్యకతను వివరిస్తూ బాలింతలకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు గంటలోపు తల్లులు తాపిస్తే బిడ్డకు పలు వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మేరీ, వనిత, సుజాత, ఆశా కార్యకర్తలు మేరి, అప్పల నరసమ్మ పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం

మద్దిలపాలెం: బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కోర్సుకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని తెలిపారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కోర్సుకు అవసరమైన వ్యవస్థను నిర్మించే దిశగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలోకి వచ్చే సమయానికి క్వాంటమ్ రంగంలోని సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ప్రత్యక్షంగా పాల్గొని ఆచార్యులకు శిక్షణ అందిస్తారన్నారు.

యువజన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: అంతర్జాతీయ యువజన దినోత్సవం – 2025 ఉత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 12న ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఇంటర్ ఫెయిత్ డైలాగ్, యూత్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంతో కొనసాగనుంది. కార్యక్రమాన్ని యోస్ వి కేన్ యువజన సంస్థ(విశాఖపట్నం), ఆర్థిక శాస్త్ర విభాగం, ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్(భారత ప్రభుత్వం), ఏయూ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ యూనిస్, ప్రొఫెసర్ డి.ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.